# కొనసాగుతున్న బడిబాట

- సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు
- విపులంగా వివరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు
- జిల్లాలోని గ్రామాల్లో ర్యాలీలు
- పాఠశాలల్లో బడీడు పిల్లలను చేర్పించాలని కరపత్రాలు పంపిణీ



షాద్‌నగర్‌టౌన్ : తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌టౌన్, జూన్ 8 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని షాద్‌నగర్‌లోని పద్మావతికాలనీ జిల్లా పరిషత్ కుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ అన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, శ్రీలక్ష్మి, ప్రమీల, రాజశేఖర్, అరుంధతి పాల్గొన్నారు.

## ఇంటింటికీ తిరుగుతూ..

**షాద్‌నగర్‌రూరల్ :** ఫరూఖ్‌నగర్ మండలంలోని గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నది. శనివారం మండలంలోని జోగమ్మగూడెం, రామేశ్వరం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యా బోధన, మౌలిక వసతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు.



షాద్‌నగర్‌రూరల్ : బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

## బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

**అబ్దుల్లాపూర్‌మెట్ :** బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంపీపీ బుర్ర రేఖ అన్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన బడి బాట కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఎంఈవో వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కరపత్రాలు పంచి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజు లేకుండా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తారని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజన వసతులను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో తెలుగు మీడియం మాత్రమే ఉండేదని.. ప్రస్తుతం ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లిష్ మీడియం ఉందని వారు తెలిపారు. ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాషా, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, నాయకులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాలల చైర్మన్లు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.



పెద్దఅంబర్‌పేట : పసుమాములలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అబ్దుల్లాపూర్‌మెట్ : విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేఖ

## సర్కారు బడుల్లో అన్ని వసతులు

**పెద్దఅంబర్‌పేట :** సర్కారు బడిలో అన్ని వసతులు కల్పిస్తున్నామని, పిల్లలను బడికి పంపాలని ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి అన్నారు. మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

**యాచారం :** మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మూడోరోజు కొనసాగింది. మేడిపల్లి, నందివనపర్తి, చింతపట్ల తదితర గ్రామాల్లో శనివారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కరపత్రాలను పంచారు. ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలతో పాటు మెరుగైన విద్యను అందించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఏవీఆర్ శాస్త్రీ, ఉపాధ్యాయులు బోజయ్య, పద్మశ్రీ, పద్మలత, వెంకట్‌రెడ్డి, కిషన్, అరుణ ఉన్నారు.



యాచారం : నందివనపర్తిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



పూజల్లో పాల్గొన్న సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కడ్తాల్, జూన్ 8 : సమాజంలో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు కోర్పోలు లీలమ్మ, లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో గల వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రతి నెల రెండో శనివారం నిర్వహించే పూజా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఉదయం ఎడ్ల యాదయ్యయాదవ్, జయమ్మ దంపతులు స్వామివారికి అభిషేకాలు, సింధూర ధారణ, హనుమాన్ చాలీసా పఠనం, సత్యనారాయణస్వామి వ్రతాలు, హోమాలు, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.



ప్రముఖ్ టౌన్‌షిప్‌లో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

## నిర్మాణం తొలగింపు

తుర్కయాంజాల్, జూన్ 8 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడ ప్రముఖ్ టౌన్‌షిప్‌లో రోడ్డును ఆక్రమించి చేపట్టినన నిర్మాణాన్ని శనివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఇండ్లను నిర్మించిన క్రమంలో రోడ్లను ఆక్రమిస్తూ చెట్ల పొదల ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నిర్మాణదారుడు మున్సిపల్ నిబంధనలు పాటిస్తూ ఇంటి నిర్మాణం చేపట్టాలని వారు సూచించారు.



తలకొండపల్లి మండల పరిధిలోని వెంకట్రావుపేట్ గ్రామపంచాయతీకి చెందిన చప్పిడి బాలమణి, హుస్సేన్ దంపతుల కుమార్తె నవ్య నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 720 మార్కులకు 637 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా శనివారం బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి ఇమ్మడి మహేశ్ నవ్యను సన్మానించారు. – ఆమనగల్లు, (తలకొండపల్లి) జూన్ 8



బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ చేవెళ్ల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. – చేవెళ్లటౌన్, జూన్ 6




సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు

## దశలవారీగా అభివృద్ధి చేస్తా

- ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి
- రూ.22లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఆదిబట్ల, జూన్ 8 : దశలవారీగా ఆదిబట్ల మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి 2వ వార్డు వేదపురి కాలనీలో రూ.7లక్షలతో, 11వ వార్డు బాలాజీనగర్ కాలనీలో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీకి మరిన్ని నిధులు తీసుకువచ్చి రాష్ట్రంలోనే నంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధిలో వెనుకబడి పోయిందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వంతో కొట్లాడి మరిన్ని నిధులు తీసుకువస్తానన్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయడానికి ప్రణాళిక ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధిపై చర్చిస్తామని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల ముందే రాజకీయాలు చేయాలని.. తరువాత ప్రతిఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు మౌనిక, అర్చన, ఏఈలు వీరాంజనేయులు, జాన్సన్, నాయకులు రాంరెడ్డి, ఉదయపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రామారావు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, పాండుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

## బదిలీలు, ప్రమోషన్లలో జిల్లా ఉపాధ్యాయులకు అవకాశమివ్వాలి



కడ్తాల : ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వివిధ మండలాల ఉపాధ్యాయులు

కడ్తాల్, జూన్ 8 : రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులకు అవకాశమివ్వాలని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయులు కోరారు. శనివారం హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో ఉపాధ్యాయులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో రంగారెడ్డి జిల్లాను మినహాయించడంలో, భవిష్యత్‌లో జరిగే ప్రమోషన్లలో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. గతేడాది ఆగస్టు నెలలో నిర్వహించిన బదిలీల షెడ్యూల్‌ను, జిల్లాలో 24 శాతం హెచ్‌ఆర్‌ఏలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్వార్థంతో కోర్టుకు వెళ్లి రాష్ట్రవ్యాప్తంగా జరిగే బదిలీలను నిలిపివేయడం జరిగిందని గుర్తుచేశారు. ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన షెడ్యూల్‌లో రంగారెడ్డి జిల్లాను మినహాయించడంతో ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందడుగు వేసి బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో జిల్లాను చేర్చాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఎప్పుడూ అక్కడే పనిచేయాలని, తాము మాత్రం పట్టణాల్లో పనిచేస్తామనే ధోరణిలో ఉపాధ్యాయులు వ్యవహరిస్తుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉన్నప్పటికీ పదోన్నతులు జరుగకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. కొందరు స్వార్థపరులైన ఉపాధ్యాయులు లాబీయింగ్‌తో, కోర్టు కేసులతో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను అడ్డుకుంటున్నారని వారు వివరించారు. వినతిపత్రం అందజేసినవారిలో పలు మండలాల ఉపాధ్యాయులు ఉన్నారు.

### నూతన కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

**ఆమనగల్లు :** ఆమనగల్లులో ఉన్న జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణశర్మ, యాదిలాల్, సుధాకర్‌రెడ్డి, న్యాయవాదులు మల్లేశ్, రామకృష్ణ, శేఖర్, కృష్ణ, మధు, సంతోష్, గణేష్, దేవేందర్ ఉన్నారు.





ఇబ్రహీంపట్నం : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

## రాజీమార్గమే రాజమార్గం

### జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశం మేరకు లోక్ అదాలత్‌లు



చేవెళ్లటౌన్: లోక్ అదాలత్‌లో సమస్యలను పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

ఇబ్రహీంపట్నం, జూన్ 8 : కోర్టు కేసుల పరిష్కారానికి రాజీమార్గమే రాజమార్గమని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్‌లో 2718 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ ద్వారా ఎన్నో ఏండ్ల సమస్యలను సైతం పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్, న్యాయమూర్తి జయసింహ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వరలక్ష్మి, న్యాయవాదులు మాదన్న, నరేందర్ ఉన్నారు.

### 319 కేసులు పరిష్కారం

**చేవెళ్లటౌన్ :** కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకునేందుకు లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశం మేరకు శనివారం చేవెళ్ల కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న చిన్న కారణాలతో కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి టైము వృథా చేసుకోవద్దన్నారు. అర్జిదారులు, కక్షిదారులు పరస్పర అవగాహనకు వచ్చి కేసులు రాజీ చేసుకుంటే లోక్ అదాలత్‌లో వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఒకసారి లోక్ అదాలత్‌లో కొట్టివేసిన కేసులను తిరిగి పై కోర్టులో అప్పీలు చేయడానికి వీలుండదన్నారు. ప్రతి చిన్న విషయానికి ఒకరిపై ఒక్కరు కేసులు పెట్టుకోవడం వల్ల కక్షలు పెరిగి శాంతియుత వాతావరణానికి భంగం కలుగుతుందన్నారు. అందరూ కలిసి మెలిసి జీవించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో మొత్తం 319 కేసులు పరిష్కరించగా, రూ.7,71,000 ఫైన్ వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సీఐ లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఉన్నారు.

### 1392 కేసులు రాజీ

**ఆమనగల్లు :** రాజీయే రాజమారమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లులోని కోర్టు ప్రాంగణంలో స్వరూప ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి మొత్తం 1392 కేసులు రాజీ అయినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, నాలుగు మండలాల సీఐలు, ఎస్సైలు , కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి స్వరూప



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

### వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

కడ్తాల్, జూన్ 8 : దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం కడ్తాల్‌లోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్వహించిన వీహెచ్‌పీఎస్ మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరడంలేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు., వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం దివ్యాంగులకు ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 22న కడ్తాల్‌లో నిర్వహించే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో త్వరలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాజు, జిల్లా అధికార ప్రతినిధి జంగయ్య, కడ్తాల్, యాచారం మండలాల అధ్యక్షులు వెంకటేశ్, సలీం, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు జంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అమెరికాలోని జార్జియా, అట్లాంటా వేదికగా నిర్వహిస్తున్న 18వ ఆటా-2024 మహాసభల వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సభలకు ఆహ్వానం అందటంతో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. – కడ్తాల్, జూన్ 8





నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని మండల పరిధిలోని పెంజర్లకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కొత్తూరు మండల ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయన ఇంటి వద్ద శనివారం కలిసి శుభాకాంక్షలు చెప్పారు. – కొత్తూరు, జూన్ 8





## కదిలారు.. సరిచేశారు

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం వైఎస్సార్ కాలనీలోని విద్యుత్తు స్తంభం ఇంటిపైకి వంగి ప్రమాదకరంగా మారిన విషయంపై శనివారం 'కూలితేనే కదులుతారా' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి విద్యుత్తుశాఖ అధికారులు స్పందించారు. ఏఈఈ చంద్రమౌళి ఆదేశాలతో సిబ్బంది వంగిన స్తంభాన్ని సరిచేశారు. **- పెద్దఅంబర్‌పేట, జూన్ 8**

## అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

### ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి



వైఎంతండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు, జూన్ 8: తండా పంచాయతీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వైఎం తండాల్లో ఎంపీపీ నిధులు రూ.4 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తండా పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అందుకోసం తండాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు కదులుతున్నామని చెప్పారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లను సీసీలుగా మార్చే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతున్నన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డాకీ, మాజీ సర్పంచ్ అరుణ, రవినాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్, మాజీ ఉపసర్పంచ్ దశరథ్‌నాయక్ పాల్గొన్నారు.